


ఓటుకు వేళాయె!

- నేడే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- ఎప్పటికప్పుడు ఈసీకి అప్‌డేట్స్ కోసం ప్రత్యేక సిబ్బంది
- భారీ భద్రత ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ

మొత్తం ఓటర్లు: 249022
పురుషులు: 129326
మహిళలు: 119688
ఇతరులు: 8

సనత్‌నగర్: నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో 100 భవనాల్లో (లొకేషన్స్) 229 బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ బూత్‌ల ద్వారా 249022 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వరండాలు లేని పోలింగ్ బూత్‌ల ముందు షామియానా ఏర్పాటు చేయడం, మంచినీటి వసతి, టాయిలెట్లు, మరుగుదొడ్లు వంటి వసతులపై పోలింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇంటింటికి స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోనే దాదాపు 2500 మంది సిబ్బంది ఎన్నికల విధులకు పురమాయించారు. నియోజకవర్గాన్ని 23 రెవెన్యూ రూట్లుగా విభజించారు. ఉస్మానియా యూనివర్శిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను ఎన్నికల సిబ్బందికి బుధవారం సాయంత్రమే పంపిణీ చేశారు. పోలింగ్ జరుగుతున్న తీరు, క్యూలో ఎంతమంది నిలబడ్డారు..గంట గంటకూ పోలింగ్ శాతం..వంటి వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు నివేదించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం సెక్టోరియల్ అధికారులతో పాటు సహాయక సెక్టోరియల్ అధికారులను నియమించారు. వీరు 10–15 పోలింగ్‌బూత్‌లలో జరుగుతున్న పోలింగ్ సరళిపై నిఘా ఉంచి అప్‌డేట్స్ అందిస్తుంటారు.

మొత్తం ఓటర్లు: 262517
పురుషులు: 131778
మహిళలు: 130714
ఇతరులు: 25

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో 220 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పెరిగిన ఓటర్ల కోసం అదనంగా మరో 3 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తంగా పోలింగ్ 104 భవనాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల సంఖ్య 223కు చేరింది. 262517 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణ కోసం రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, కట్టుదిట్టమైన బందోబస్తు కోసం పోలీసులు కలుపుకుని సుమారు 4275 అధికారులు, సిబ్బందిని నియమించారు.



ఊరెళ్తాం.. ఓటేస్తాం..

ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బుధవారం కిక్కిరిసిపోయింది. వివిధ జిల్లాలకు చెందిన ఓటర్లు వేలాది మంది ఓటు హక్కును తమ గ్రామంలో వినియోగించుకోవడం కోసం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఓటర్లు పెద్దసంఖ్యలో తరలిరావడంతో రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయింది. –సికింద్రాబాద్

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయని సీఐ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని తార్నాక, లాలాపేట, రవీంద్రనగర్, నాగార్జునగర్ ఉప్పల్ నియోజకవర్గంలోని హబ్సిగూడ, పీ అండ్ టీ కాలనీ, రవీంద్రనగర్, ఓయూ క్యాంపస్‌లోని బస్తీలు, అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గాలలోని అడిక్‌మెట్ వైపు గల ఓయూ క్యాంపులలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఓయూలో పోలీస్ స్టేషన్ పరిధిలోని 53 పోలిగ్ కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఓయూ పోలీసులు, ఐదుగురు ఎస్ఐలతో పాటు అదనంగా 130 మంది సిబ్బంది మోహరించిన్నట్లు చెప్పారు. తార్నాక డివిజన్‌లోని నాగార్జునగర్, మాణికేశ్వనర్‌ను సమస్యాత్మక ప్రాంతాలుగా గురించి పోలీసు బలగాలను భారి సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడిన వెంటనే 8712660562 నంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 250733 ఓటర్లకు 235 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ తెలిపారు. 125964 మంది పురుషులు, 124761 మహిళలు ఉండగా, 8 మంది ఇతరులు ఉన్నారన్నారు. బుధవారం అన్ని పోలింగ్ స్టేషన్లకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లతో పాటు ఇతరత్రా పోలింగ్ సామగ్రిని అందజేశామన్నారు. 5 మోడల్ పోలింగ్ స్టేషన్లు, 5 మహిళలు నిర్వహించే స్టేషన్లు, యువత, పీడబ్ల్యూడీ నిర్వహించే ఒక్కో పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. దివ్యాంగులు 'సాక్షం' యాప్ ద్వారా రిక్వెస్ట్ చేస్తే పోలింగ్ కేంద్రాల వరకు తీసుకొచ్చి, ఓటు వేశాక తిరిగి ఇంటి వద్ద దించే సదుపాయం కల్పిస్తామని మధుకర్ నాయక్ పేర్కొన్నారు.

డీఆర్‌సీని సందర్శించిన కలెక్టర్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్పీరోడ్డులోని సీఎస్ఐ వెస్లీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కొనసాగుతున్న కంటోన్మెంట్ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్, కౌంటింగ్ (డీఆర్సీ) కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు తరలింపు, ఎన్నికలు పూర్తయ్యాక వచ్చిన ఈవీఎంలను భద్రపరచడం తదితర అంశాల గురించి చర్చించారు. అలాగే ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గాయిత్రి కృష్ణన్ కూడా డీఆర్సీ కేంద్రాన్ని పరిశీలించారు.



దుబాయ్ సదస్సులో ప్రొ.హమీదాబి ఉపన్యాసం



ఉస్మానియా యూనివర్సిటీ: దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఓయూ మైక్రో బయోలజీ అధ్యాపకురాలు ప్రొ. డాక్టర్ హమీదాబి హాజరై ఉపన్యసించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు దుబాయ్‌లోని బిట్స్‌పిలాని క్యాంపస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మల్టీ ఫంక్షనల్ మైక్రోబియల్ సర్‌ఫ్యాక్టెంట్స్ ఫర్ సస్టైనబుల్ ఆగ్రో ఫుడ్ ఇండస్ట్రీ అనే అంశం పై ఉపన్యసించారు. భారత్, అమెరికాతో పాటు ఆరు దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ సదస్సుకు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు ఓయూ అధికారులు వివరించారు. ఓయూ నుంచి దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు హాజరై పరిశోధన పత్రాన్ని సమర్పించడం పట్ల ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ డాక్టర్ హమీదాబిని అభినందిచారు.

ఎన్నికల సామగ్రి అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు జరిగే ఎన్నికల కోసం ఓయూ క్యాంపస్‌లోని ఎంబీఏ కాలేజీలో సనత్‌నగర్ నియోజకవర్గం, దూరవిద్య కేంద్రంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీఎంల పై అవగాహన కల్పించి ఎన్నికల సామగ్రిని అందజేశారు. జిల్లా ఉప ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దరిశెట్టి ఓయూను సందర్శించి సిబ్బంది, అధికారులకు కావాల్సిన వసతులపై సమీక్షించారు.



